సిఐ, ఎస్ఐపై టిడిపి నేతల ఫిర్యాదు

భీమవరం రూరల్ : లోకేష్ యువగళం పాదయాత్రలో వైసిపి, టిడిపి పరస్పర దాడుల రచ్చ భీమవరంలో నేటికీ కొనసాగుతుంది. పాదయాత్రలో వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, ఎస్ఐ మురళి, వైసిపి నాయకుడు సుధాకర్ తనపై దాడి చేశారని శుక్రవారం సాయంత్రం అయినంపూడి రమేష్ టిడిపి నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన తాను పాదయాత్రలో లోకేష్‌కు వచ్చిన అర్జీలను భద్రపరుస్తానని రమేష్ తెలిపారు. వైసిపి వారు దాడి చేస్తుండి తాను అక్కడున్న కానిస్టేబుల్‌ను సిఐ ఎవరని అడగ్గా ఆయన తనకు సిఐను చూపించారన్నారు. తాను వెంటనే సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మురళీ వద్దకు వెళ్లి తమ నాయకుడు లోకేష్‌పై దాడి చేసేలా ఉన్నారని, రక్షణ కల్పించాలని కోరానని తెలిపారు. అయితే సిఐ, ఎస్ఐలతో పాటు వైసిపి నాయకుడు సుధాకర్ తనపై దాడి చేశారని రమేష్ చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ సభ్యులు వేండ్ర శ్రీనివాస్, నేతలు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం

కిక్కిరిసిన చించినాడ బ్రిడ్జి

- శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం అందించేందుకు కృషి
- ఉపాధి హామీ అనుసంధానంతో తాడి చెట్లు పెంపకం
- బిసిల సంక్షేమ పథకాల రద్దు వైపిసి ప్రభుత్వ నిర్వాకం
- మెరుగైన లిక్కర్ పాలసీ తీసుకొస్తాం
- శెట్టిబలిజ సామాజిక తరగతి ముఖాముఖిలో నారా లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

తాము అధికారంలోకి రాగానే కులవృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తామని, గతంలో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన అనేక బిసి సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా 26 వేల మందిపై అక్రమ కేసులు బనాయించిన జగన్ బిసి ద్రోహి అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. యువగళం పాదయాత్ర శుక్రవారం 208వ రోజు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో సాగింది. కలగంపూడి యువగళం క్యాంప్ సైట్ వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజ సామాజిక తరగతి ప్రతినిధులతో ముఖాముఖిలో లోకేష్ పాల్గొన్నారు. సంఘాల నేతలు నరసింహమూర్తి, వెంకట్, రాంబాబు తదితరులు అనేక సమస్యలు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. కల్లుగీత, కొబ్బరిదింపు తదితర వృత్తుల మీద ఎన్నోఏళ్ల నుంచి ఆధారపడి జీవిస్తున్నామన్నారు. 50 ఏళ్లు వచ్చిన వారికి పెన్షన్లు, గుర్తింపు కార్డు అందించడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో తాడిచెట్లను పెంచి వృత్తులను కాపాడాలని కోరారు. బిసిల సంక్షేమంతోపాటు రాజ్యాధికారం అందించేలా చేయూతనివ్వాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తులు శెట్టిబలిజలని అన్నారు. తాము అధికారంలోకి రాగానే గతంలో అమలు చేసిన పథకాలన్నీ పునరుద్దరిస్తామన్నారు. మంత్రి తన శాఖలో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం 26 వేల దొంగ కేసులు పెట్టిందని, దీనిలో ఎక్కువ కేసులు బిసిలపైనే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత మద్యం పాలసీని రద్దు చేసి మెరుగైన పాలసీ తీసుకొస్తామన్నారు. తాడిచెట్టు పెరగాలంటే 12 ఏళ్లు పడుతుందని, వీటని జోన్లు వారీగా పెంచుతామని అన్నారు. ఉపాధి హామీకి తాడిచెట్ల పెంపకం, రక్షణను అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి బిసిలను పేదరికం నుంచి బయటకు తీసుకొస్తామన్నారు. తెలంగాణ మాదిరిగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి రుణాలు, సబ్సిడీలు అందిస్తామన్నారు. చేతివృత్తిదారులకు గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఇస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలు ఆరు నెలలే చెల్లుబాటులో ఉంటున్నాయని, టిడిపి అధికారం చేపట్టాక శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాన్ని అందించే ఏర్పాటు చేస్తామన్నారు.

బిసి కళ్యాణ మండపానికి నేనే రిబ్బన్ కట్ చేస్తా

పాలకొల్లులో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యాన రూ.కోటీ 50 లక్షలతో నిర్మాణం చేపట్టిన బిసి కళ్యాణమండపాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దారుణమని లోకేష్ అన్నారు. తాము అధికారంలోకి ఆరు నెలల్లో ఆ కళ్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్ది తానే రిబ్బన్ కట్ చేస్తాని హామీ ఇచ్చారు.

నిమ్మలను భారీ మెజార్టీతో గెలిపించండి

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు నీతి నిజాయతీ గల నాయకుడని, ఏదైనా పని చేయాలనుకుంటే తాను నిద్రపోడని, మిగిలిన వారిని నిద్రపోనీయడని లోకేష్ వ్యాఖ్యానించారు. అటువంటి కష్టపడి పని చేసే నాయకుడిని ప్రజలంతా ఆదరించాలని, నిమ్మల హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. అయితే గతం కంటే రెట్టింపు మెజార్టీని అందించి నిమ్మలను గెలిపించాలని పిలుపునిచ్చారు. శాసనమండలి మాజీ వైస్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ టిడిపి అంటే బిసి.. బిసి అంటే టిడిపి అని అన్నారు.

పాదయాత్రలో నారా లోకేష్‌తోపాటు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు

పశ్చిమలో ముగిసిన పాదయాత్ర

ఈ నెల మూడో తేదీ మధ్యాహ్నం జిల్లాలోని గణపవరం మండలంలో ప్రవేశించిన యాత్ర ఐదు రోజులపాటు జిల్లాలో సాగింది. ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల గుండా చించినాడ బ్రిడ్జి మీదుగా శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశించింది.

కిక్కిరిసిన చించినాడ బ్రిడ్జి

లోకేష్ యువగళం పాదయాత్ర బృందంతో వశిష్ట గోదావరిపై చించినాడ వంతెన కిక్కిరిసిపోయింది. లోకేష్‌కు స్వాగతం పలుకుతూ గోదావరి మధ్యలో పసుపు జెండాలు, బెలూన్లతో అలంకరించిన పడవలతో మత్స్యకారులు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీటిని లోకేష్ కొద్దిసేపు తిలకించారు, పాదయాత్ర మధ్యలో నేత కార్మికులు, రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం యాత్ర కోనసీమ జిల్లా దిండిలోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంపీ మాగంటి బాబు, టిడిపి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, కడలి గోపాలరావు, గుబ్బల ఏడుకొండలు, గుబ్బల ఓంకార్, రుద్రరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలునికి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి - భీమవరం

తాడేరు టౌన్ షిప్ వద్ద ఈ నెల 5వ తేదీ రాత్రి జరిగిన వైసిపి, టిడిపి పరస్పర దాడి ఘటనలో గాయపడిన బాలుడు దుర్గాప్రసాద్‌ను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పరామర్శించారు. దాడిలో దుర్గా ప్రసాద్ కంటి పైభాగంలో రాయి తగిలి గాయమైన సంగతి తెలిసిందే. తాజాగా లోకేష్‌ను చూసేందుకు దుర్గాప్రసాద్ కలగంపూడి రాగా దగ్గరకు తీసుకుని పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

కరెంటు కోత.. బిల్లుల మోత..!

ఒకపక్క కరెంటు కోతలు, మరోపక్క విద్యుత్ బిల్లుల మోతతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. వర్షాకాలం సైతం పల్లె, పట్టణం అంటూ అనే తేడా లేకుండా గంటలు తరబడి కరెంటు కోతలు అమలవుతున్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులో సైతం అర్ధరాత్రి వేళల్లో కరెంటు కోతలతో జనం విలవిల్లాడుతున్నారు.

- పల్లె, పట్టణం తేడా లేకుండా ఎడాపెడా కోతలు
- అర్ధరాత్రి వేళల్లో కోతలతో తీవ్ర ఇబ్బందులు
- మరోపక్క అదనపు ఛార్జీలతో బిల్లుల మోత
- లబోదిబోమంటున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 లక్షల వరకూ గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అత్యధిక కనెక్షన్లు సామాన్య ప్రజానీకానివే. ఎప్పుడు కరెంటు పోతుందో.. ఎప్పుడు ఉంటుందో తెలియని దుస్థితి నెలకొంది. అర్ధరాత్రి వేళల్లో కరెంటు కోతలు విధించడంతో దోమలు, ఉక్కపోతతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక స్తోమత ఉన్నోళ్లు కరెంటు కోతలు భరించలేక ఇన్వర్టర్లు కొనుగోలు చేస్తుండగా, ఆర్థిక పరిస్థితి బాగోలేని కుటుంబాలు చీకటిలోనే మగ్గుతున్నాయి. కరెంటు కోతలతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకపక్క పెరిగిన విద్యుత్ బిల్లులు కట్టలేక, మరోపక్క కరెంటు కోతలతో వ్యాపారం సరిగ్గా సాగక సతమతమవుతున్నారు. ఆక్వా రైతులు సైతం కరెంటు కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014 తర్వాత కరెంటు కోతలు దాదాపుగా లేకుండాపోయాయి. ఇటీవల కాలంలో కోతలు పెరగడం జనంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాయంత్రం ఏడుగంటల సమయంలో కరెంటు తీసేయడంతో విద్యార్థులు సైతం చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిరాక్స్ షాపులు, వెల్డింగ్ వ్యాపారులు ఇలా అనేక మంది చిరువ్యాపారులు కరెంటు కోతలతో ఉపాధి కోల్పోతున్నారు. బిల్లులు పెద్దఎత్తున వసూలు చేస్తూ కూడా కోతలు విధించడం జనంలో హాట్‌టాపిక్‌గా మారింది. కొన్నిచోట్ల లోవోల్టేజీ కరెంటుతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్యాన్లు తిరగవు, లైట్లు వెలగని పరిస్థితి ఏర్పడుతోంది. అదేమని అడిగితే ట్రాన్స్‌ఫార్మర్ వేయాల్సి ఉందని సమాధానం చెప్పి దాటవేస్తున్న పరిస్థితి ఉంది.

అదనపు ఛార్జీల పేరుతో బిల్లుల మోత

కరెంటు బిల్లుల్లో ప్రభుత్వం విధిస్తున్న అదనపు ఛార్జీల మోత జనాలను గుక్కతిప్పుకోనీయకుండా చేస్తున్నాయి. కరెంటు బిల్లుకు సమానంగా అదనపు ఛార్జీల భారం పడుతోంది. ఫిక్స్‌డ్ ఛార్జీలు, కష్టమర్, ఇడి, సర్‌ఛార్జీ, ట్రూఅప్ ఛార్జీ, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో మోత మోగించేస్తున్నారు. ఏలూరులోని ఓ వినియోగదారుడికి రూ.417 కరెంటు బిల్లు వస్తే అంతేస్థాయిలో అదనపు ఛార్జీలు వేయడంతో రూ.781 బిల్లు వచ్చింది. దీంతో సదరు వినియోగదారుడు లబోదిబోమంటున్నాడు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కరెంటు బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతున్నారు. గతంలో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనపు ఛార్జీల రూపంలో వసూలు చేయడంపై వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీరుపై సర్వత్రా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. కరెంటు బిల్లులు సామాన్య ప్రజానీకానికి భారంగా మారడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అదనపు ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని జనం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలోని జాతీయ రహదారులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్ వద్ద ఎన్‌హెచ్, ఆర్అండ్‌బి అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశమై జాతీయ రహదారులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు పూర్తయి అనుబంధంగా ఉన్న రోడ్ల మార్గాలను ప్రయాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కోరారు. ముఖ్యంగా నరసాపురంలో ఎన్‌హెచ్‌కి ఆనుకుని ఉన్న సుమారు 15 మార్గాలను రాకపోకలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురుగా, అడవిపాలెం ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద ఎన్‌హెచ్ రహదారిలో ఒక సీజన్‌లో నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉంటోందని, సాంకేతికంగా పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. నరసాపురం బైపాస్ ఏర్పాటుకు భూసేకరణ పనులు పూర్తయ్యాయని, త్వరితగతిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. శృంగవృక్షం ప్రాంతంలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, దీనికి అనుబంధంగా పనులను చేపట్టాలని ఆదేశించారు. ఉండి, మేడపాడు - నరసాపురం రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ అవార్డులను వెంటనే పాస్ చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. సీతారాంపురం టు కాళీపట్నం మధ్యగల నేషనల్ హైవేకు ఆనుకుని కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగు తున్నాయని, ఎన్‌హెచ్ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, తగు చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించనున్నట్లు తెలిపారు. సిఆర్ఎఫ్ కింద పెద్ద కాపవరం, చిన్న కాపవరం ప్రాంతాల్లో మంజూరైన రెండు రోడ్ల నిర్మాణాలకు ముందుగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ - 216ఎ పీడీ డి.సురేంద్రనాథ్, పిఎం కె.బాలసుబ్రమణ్యం, డిపిఎం కె.శ్రవణ్‌కుమార్, ఎన్‌హెచ్ 165 డిఇ ఎం.శ్రీనివాసరావు, కాకినాడ ఎన్‌హెచ్ డిఇ ఎల్ఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా ఆర్అండ్‌బి అధికారి బి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో కార్మికులకు ఆర్థిక లబ్ధి

భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలతో మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

గత నాలుగున్నరేళ్లగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు లక్షల రూపాయల ఆర్థిక లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి కొట్టును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్నింటికీ అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదరికాన్ని నిర్మూలించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు కూడా ఆర్థిక లబ్ధి పొందుతున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏమైనా సమస్యలుంటే వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని డిప్యూటీ సిఎం కొట్టు హామీ ఇచ్చారు. అలాగే వెల్ఫేర్ బోర్డు, ఫండ్‌కు సంబంధించి కూడా అత్యున్నత న్యాయస్థానం తీర్పును ప్రభుత్వం శిరసావహిస్తోందన్నారు. పెండింగ్ క్లైమ్‌ల పరిష్కారానికి తక్షణం కార్మిక శాఖా మంత్రితో మాట్లాడతానని కొట్టు హామీ ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ 1996లో కేంద్రం సంక్షేమ బోర్డు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. 2009లో రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఒక శాతం సెస్ వసూలు చేసి వెల్ఫేర్ బోర్డుకు జమచేస్తామని తెలిపారు. ఈ మొత్తాన్ని భవన నిర్మాణ కార్మిక కుటుంబాల సంక్షేమ పథకాల నిమిత్తం మాత్రమే వాడాలని చట్టంలో ఉందన్నారు. తక్షణం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, దాని ద్వారా మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ క్లెయిములు తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, దూలం ప్రసాద్, మండా సూరిబాబు, బాతు నాగేశ్వరరావు, తూము శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి దారుణం

తణుకు బార్ అసోసియేషన్ వద్ద ధర్నా

తణుకు బార్ అసోసియేషన్ వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను వెంటనే విధుల నుంచి బహిష్కరించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో హాపూరులో న్యాయవాదులపై పోలీసులు చేసిన దాడికి నిరసనగా శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ చట్టాల అమలు కోసం పనిచేస్తున్న వారిపై పోలీసులు దాడి చేయడం అన్యాయమన్నారు. భారతదేశంలో న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగాయని, వాటిని అరికట్టే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అధ్యక్షులు కౌరు వెంకటేశ్వర్లు, నేతల సోమేశ్వరరావు, రమేష్, జనార్ధన్, లాజర్, శ్రీనివాస్, సిహెచ్.నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల తొలగింపు ఆపాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ నాయకుల ధర్నా

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

పైడిపర్రు మడుగు వద్ద ఉన్న పేదల ఇళ్ల తొలగింపును తక్షణం ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పైడిపర్రు మడుగు వద్ద ఉన్న ఇళ్ల తొలగింపులు ఆపాలని, పేదల ఇళ్లకు రక్షణ కల్పించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజు మాట్లాడుతూ పైడిపర్రు మడుగు వద్ద గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా ఖాళీ చేయించడం అన్యాయమన్నారు. శుక్రవారం ఉదయం విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మీటర్లు తీసుకుపోయారన్నారు. పేదలు భూములు లాక్కునే ముందు ఆంధ్రా షుగర్స్ వద్ద ఉన్న 7.26 సెంట్లు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. పెత్తందార్లకు, పేదలకు యుద్ధం అంటే ఇదేనా అన్నారు. ప్రభుత్వ భూముల్లో ఉన్నవారికి ప్రత్యామ్నాయం చూపించేవరకు ఇళ్ల తొలగింపు ఆపాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అనేక ఏళ్లుగా విద్యుత్ ఉన్నప్పుడు అధికారులు ఏకపక్షంగా విద్యుత్ మీటర్లు తీయడం దారుణమన్నారు. దీనిపై లీగల్‌గా పోరాడతామని చెప్పారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అజయకుమారి, గార రంగారావు, కటిక రెడ్డి సుబ్బలక్ష్మి, అలమండ నాగరత్నం, రచాబత్తుల లక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ రామభద్రరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాతావరణ కాలుష్యంతో అంతుపట్టని వ్యాధులు ఎన్నో వస్తున్నాయని, పకృతి సిద్ధమైన గాలి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్యమే ఇందుకు ముఖ్య కారణమని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ రామభద్రరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో గ్రీన్ డే పిలుపు మేరకు డిఎన్ఆర్ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ అకాల వర్షాలు, అకాల ఎండలు విపరీత ధోరణితో ఉన్నాయంటే వాతావరణ సమతుల్యం లేకపోవడమేనన్నారు. ప్రతి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతిజ్ఞ నిర్వహించి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం కళాశాలలో 26 మొక్కలను నాటారు. ప్రిన్సిపల్ శివాజీ రాజు, పాలకవర్గ సభ్యులు కొత్తపల్లి శివరామరాజు, వెంకన్నబాబు, డాక్టర్ శ్రీధర్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళారంగంలో గరికిపాటి రాజారావు కృషి ఎనలేనిది

ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ

ప్రజాశక్తి - భీమవరం

ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు కళారంగంలో ఎనలేని కృషి చేశారని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలి అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రాజారావు 60వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి ప్రజానాట్య మండలి కళాకారులు, స్థానిక కళాకారులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ వలి మాట్లాడుతూ డాక్టర్ రాజారావు ప్రజా వైద్యశాల స్థాపించి ప్రజలకు వైద్యం చేయటమే కాకుండా కళారంగంలో తనదైన ఒక ప్రత్యేకముద్ర వేసుకున్నారన్నారు. దోపిడీ వర్గాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి కళారూపాల ద్వారా ఎంతో కృషి చేశారన్నారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు చైతన్య ప్రసాద్ మాట్లాడుతూ సినీ రంగంలో ఎందరో ప్రముఖ కళాకారులను పరిచయం చేసిన డాక్టర్ రాజారావు కళారంగంలో అనేక సేవలందించారన్నారు. రాజారావు ఆశయ సాధన కోసం అందరం కృషి చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, డి.త్రిమూర్తులు, జాస్తి రత్నరమేష్‌బాబు, మునియ్య పాల్గొన్నారు.

రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మూడో దశ రీసర్వే ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మూడో దశ రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం, రీ సర్వే ప్రక్రియ, ఇతర అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇబ్బందులు తలెత్తితే జిల్లా కార్యాలయానికి తెలియజేసి సరి చేసుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లాలో మొదటి, రెండో రీ సర్వే ప్రక్రియలు విజయవంతంగా జరిగాయని, ఇదే స్ఫూర్తితో మూడో దశ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశిత గడువులోగా రీ సర్వే కింద అన్ని రకాల ప్రక్రియలను పూర్తి చేయాలని, ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములు సర్వే చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తి అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన చోట్ల స్థల సేకరణ పూర్తి చేసుకుని పరిహారం నగదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉన్నచోట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా సర్వే అధికారులు కె.జాషువా, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎన్.సరోజ, కలెక్టర్ కార్యాలయం ఎఒ అప్పారావు, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, భూ సేకరణ తహశీల్దార్ సిహెచ్.రవికుమార్ పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఉండి

ప్రస్తుత వర్షాకాలంలో డెంగీ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉందని, దీని బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది కోరారు. ఉండి మండల వ్యాప్తంగా డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున దోమ తెరను వాడాలని సూచించారు. డెంగీ లక్షణాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగీ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రోటరీ యూత్ సర్వీస్ నెలలో భాగంగా శుక్రవారం పాలకొల్లు రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణలో మన పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాలకొల్లులోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి వచ్చిన 140 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జూనియర్స్, సీనియర్స్ విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్లు చందక రాము, కటారి నాగేంద్ర, రోటరీ సభ్యులు కానూరి ప్రభాకర్, ఎన్ఎన్.మూర్తి, పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ గరికపాటి రాజారావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కళ ద్వారా సమాజాన్ని చైతన్యం చేయవచ్చని నిరూపించిన డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయ సాధన కోసం కళాకారులంతా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారంప్రసాద్ మాట్లాడుతూ ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన డాక్టర్ గరికిపాటి రాజారావు ఆశయ సాధన కోసం నేటి కళాకారులందరూ పునరంకితం కావాలన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుడు సినిమా మేకప్ మాన్ పసుపులేటి సూర్యచంద్రరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షులు గొన్నబత్తుల మల్లేశ్వరరావు, కళారంజని వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాసరది శ్రీనివాస్, కళాకారులు పులఖండం ఉగాది, చాంద్ బాషా, న్యాయవాది మల్లుల శ్రీనివాస్, పొసంశెట్టి మురళి, కృప పాల్గొన్నారు.

చేనేత వస్త్ర హస్తకళ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చేనేత కార్మికులకు తమ ప్రభుత్వం అండగా ఉందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సిఎం జగన్ చేనేత కార్మికులను ఆదుకునే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. స్థానిక త్యాగరాజ భవనంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళ హ్యాండ్‌లూమ్, హ్యాండి క్రాఫ్ట్‌బజార్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బజార్ లో చేనేత హస్తకళల ప్రదర్శన, అమ్మకాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రేవూరి గోగురాజు, తోట భోగయ్య, చెల్లబోయిన సూర్యప్రకాష్, గంటా సుందర్‌కుమార్, కొట్టి కుటుంబరావు, మందారపు శ్యాంసుందర్, గ్రంధి వెంకట్రావు పాల్గొన్నారు.

'యువగళం విజయాన్ని ఓర్వలేకే వైసిపి దాడులు'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగలం విజయవంతంగా దూసుకుపోతున్న క్రమంలో వైసిపి వారు ఓర్వలేక దాడులు చేస్తున్నారన్నారని, యువగళం వాలంటీర్లపై కేసులు పెట్టిస్తున్నారని ఆ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమవరంలో జరిగిన భారీ బహిరంగ సభ విజయవంతమైన తరువాత వైసిపి గుండాలు రాళ్లతో దాడికి పాల్పడ్డారన్నారు. వారిని యువగలం వాలంటీర్లు అడ్డుకుంటే వారిపై కేసులు పెట్టారన్నారు. పోలీసులు ఈ విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారు. 38 మంది టిడిపి కార్యకర్తలపై కేసులు పెట్టడంతో పాటు, ఎంతో సౌమ్యంగా ఉండే జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మిపై కూడా 307 కేసు పెట్టడం దారుణమన్నారు. ప్రతిపక్షం అవినీతిపై విమర్శలు చేస్తుంటే దానికి సమాధానం చెప్పే ధైర్యం లేక వేరే విషయాలపై ఎదురుదాడికి దిగుతున్నారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

బాధిత కుటుంబాలకు మెగా అభిమానులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ప్రమాదానికి గురైన నరసాపురం మండలం గాదివారితోటకు చెందిన దేవరపు హేమ జ్యోతి, మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న కెపి.పాలెం నార్త్ గ్రామానికి చెందిన నవ్య కుటుంబసభ్యులను మెగా అభిమానులు శుక్రవారం పరామర్శించారు. హేమజ్యోతి కుటుంబ సభ్యులకు రూ.పది వేలు, నవ్య కుటుంబసభ్యులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు కొత్తపల్లి నాగరాజు, కొత్తపల్లి యశ్వంత్, పులపర్తి శ్రీను, దూసనపుడి కోటేశ్వరరావు, కొప్పర్తి రమేష్, మైలబత్తుల రాంబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డాక్టర్ నిరీక్షణరాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

డాక్టరేట్ పట్టా రావడంతో మరింత బాధ్యత పెరిగిందని సంఘ సేవకులు, అవార్డు గ్రహీత డి.నిరీక్షణరాజు అన్నారు. మండలంలోని కోపల్లె గ్రామంలో డాక్టరేట్ అవార్డు గ్రహీత డి.నిరీక్షణరాజుకు శుక్రవారం ఘనంగా సత్కారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిరీక్షణరాజు తన సంపాదనలో కొంత సొమ్మును సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు తన వంతు సాయం చేస్తున్నారన్నారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా సమయంలో మొదటి, రెండు దశల్లో వందలాది మంది కార్మికులకు రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారన్నారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలు ప్రతి ఏడాది నిర్వహిస్తూ పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. నిరీక్షణరాజు చేస్తున్న సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు అందించిందన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నిరీక్షణరాజు మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ రావడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ సామాజిక సేవలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అయిమ్ రాష్ట్ర నాయకులు బల్లా రామకష్ణ, పి.సాల్మన్, జిల్లా కో-కన్వీనర్ నాగరాజ్, యండగండి సర్పంచి మూర్తి, జల్లి కాకినాడ సర్పంచి నాగరాజు, భీమవరం జిల్లా టౌన్ అధ్యక్షులు గండి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మానుకొండ కిషోర్, దాసి ప్రసాద్‌బాబు, మారంపూడి రాజా, శ్యాంకుమార్, కొండేటి జాన్, స్మిత్ కెనడీ, యాకోబు, పలు గ్రామాల నుంచి అయిమ్ నాయకులు, కోపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరీక్షణరాజును సత్కరిస్తున్న వక్తలు

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య శాఖాధికారులు జయప్రదం చేయాలని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల వైద్యశాఖాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సురక్షపై వైద్య శాఖాధికారులు దృష్టి పెట్టి ఇంటింటా సర్వే చేసి ప్రజల దీర్ఘకాలిక వ్యాధుల గురించి తెలుసుకొని వారిని గ్రామాల్లో జరిగే మెగా హెల్త్ క్యాంపులకు తీసుకురావాలని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రతి సచివాలయం వద్ద సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం తహశీల్దార్ పి.లక్ష్మి, గణపవరం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, కె.ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మన దేశంలో వ్యవసాయం తర్వాత చేనేతరంగమే ఎక్కువ మందికి జీవనోపాధి చూపిస్తుందన్నారు. దేశంలోని కొన్ని వేల గ్రామాల్లో చేనేత మగ్గాలున్నాయని, వీరి ప్రతిభా పాటవాలు, నైపుణ్యం అగ్రరాజ్యాలను సైతం ఆకర్షిస్తున్నాయని చెప్పారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లోనూ మన చేనేత వస్త్రాలకు చక్కటి గిరాకీ ఉందని తెలిపారు. అయినా చేనేత కార్మికులు ఆకలితో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు.

విద్య పట్ల అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - గణపవరం

చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య పట్ల అవగాహన కల్పించి వారిని తిరిగి పాఠశాలకు రప్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గణపవరం డిగ్రీ కాలేజీ లెక్చరర్ కె.స్వరూపరాణి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజీలో అధ్యాపకులతో కలిసి చదువు మానేసిన షాపుల్లో పనిచేస్తున్న బాల బాలికలకు శుక్రవారం సమావేశం నిర్వహించి వారికి విద్య పట్ల అవగాహన కల్పించారు. చదువు మానేసిన బాల బాలికల ందరూ మళ్లీ పాఠశాలకు రావాలన్నారు. అనంతరం వారందరికీ పెన్నులు బహుమతిగా అందించారు. ఈ కార్యక్ర మంలో జి.వెంకట్రావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, భాస్కం రావు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తిలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి అక్షరాస్యత దినోత్సవం విశిష్టతను వివరించారు. సెప్టెంబర్ 8న ప్రతి సంవత్సరం అక్షరాస్యత దినోత్సవం జరుపుకోవాలని 1966లో ఏకగ్రీవంగా తీర్మానం చేశారన్నారు. దీంతో విద్యార్థులలో అవగాహన పెరిగి నిరక్షరాస్యతను అధిగమించి సమాజానికి తమ వంతు సేవలను, నాణ్యతతో అందించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లభాష అధ్యక్షులు డేవిడ్ దినకరన్, జిడి.శ్రీనివాస్, లైబ్రేరియన్ వి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదుర్గ సన్నిథిలో మేకా శేషబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యడ్ల బజార్‌లోని కనకదుర్గ ఆలయాన్ని టిటిడి సభ్యులు మేకా శేషబాబు శుక్రవారం సతీసమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ కావలి శ్రీనివాస్, ట్రస్టీలు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద గోపురం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఎంబిసి ఛైర్మన్ పెంద్ర వీరన్న, గాదె వెంకన్న, గంటా వెంకన్న, పెచ్చెట్టి కోటేశ్వరరావు, కేతా వెంకన్న, గుండుబోయిన నాగేశ్వరరావు రాంబాబు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే జగన్ ధ్యేయం'

ప్రజాశక్తి - పోడూరు

గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ కృషి చేస్తున్నారని జిన్నూరు సర్పంచి జమ్ము బేబీమహాలక్ష్మి అన్నారు. జిన్నూరు గ్రామంలో ఆంజనేయరాజు నగర్‌లో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలు, వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. గ్రామాభివృద్ధి కోసం దశలవారీగా అవసరమైన చోట్ల డ్రెయినేజీ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ జమ్ము బుజ్జి, శెట్టి చినబాబు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉండి

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల ద్వారా ప్రతిఒక్కరూ మెరుగైన నాణ్యమైన వైద్యం పొందాలని ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. మండలంలోని చెరుకువాడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కారక్రమంలో డాక్టర్ బి.సాయిచంద్ర మాట్లాడుతూ గ్రామంలో ఉదయం వైద్య సదుపాయం అవసరమైన వారికి వైద్య సేవలందించి మధ్యాహ్నం సమయంలో మంచంబారిన పడిన రోగులకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డెంగీ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని సంప్రదించి వైద్య సదుపాయం పొందాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అందించడం వల్ల రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లి రూ.వేలు వెచ్చించాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌సి, ఎస్‌టిలను చైతన్యపర్చడమే లక్ష్యం

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రాజేష్‌బాబు

ప్రజాశక్తి - ఉండి

ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతి ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా పని చేస్తానని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు తోకల రాజేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల పూర్తయినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిలకు నేటికీ సమాజంలో అన్యాయం జరుగుతుందన్నారు. వారు చైతన్యవంతులు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, విద్యతోనే అది సాధ్యమవుతుందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం నుంచి అన్ని రాయితీలు అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టిలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యతోనే సమాజంలోని అంతరాలు తొలగిపోతాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా దళిత వర్గాలకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రభుత్వ పెద్దలు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కెనరా బ్యాంక్ వారు విద్యా జ్యోతి ఉపకార వేతనం పథకం ద్వారా పిఎల్‌కె హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ బాల వెంకట్ మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా బాలికల విద్య ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం కెనరా విద్యా జ్యోతి ద్వారా ఆరు నుంచి పదో తరగతి వరకు క్లాస్ ఫస్ట్ వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థినులకు ఈ ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు చెప్పారు. 6, 7 తరగతి వారికి రూ.2500, 8, 9, 10వ తరగతి వారికి రూ.ఐదు వేల ఐదుగురికి అందించారు. అకౌంటెంట్ సాధన చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టి.వెంకటలక్ష్మి, బిఆర్.అమర్‌కుమార్, జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థినులు

రైతులకు అందుబాటులో ఎరువులు, పురుగుమందులు

ప్రజాశక్తి - మొగల్తూరు

సార్వా సాగుకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఎడిఎ ఇ.అనిల్‌కుమారి తెలిపారు. శుక్రవారం మొగల్తూరు మూడో సచివాలయం పరిధి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. నాట్లు వేసుకోవడం ఆలస్యమైనా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పంట వేసుకున్న ప్రతి రైతు ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హత పొందుతారన్నారు. జాతీయ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరితే కలిగే ప్రయోజనాలను ఎఫ్‌పిఒ సతీష్ వివరించారు. ఈ సమావేశంలో సలహా మండలి ఛైర్మన్ కంచర్ల బాబులు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, నాయకులు పడవల సత్యనారాయణ, అయితం యుగంధర్, ఎఒ రహీమ్, వెటర్నరీ డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుగొండ

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి సూచించారు. మండలంలోని కొటాలపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో విజయకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనసరిగా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత అధిగమించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాది కిషోర్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు కాలాన్ని వృథా చేయొద్దు

ప్రజాశక్తి - తణుకు రూరల్

విద్యార్థినులు కాలాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలని న్యాయవాది వంగూరి కిషోర్ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినుల ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ విద్యార్థినులు చెడు విషయాల పట్ల ఆకర్షితులవ్వకూడదన్నారు. సమయపాలన అలవర్చుకోవాలని సూచించారు. విద్యారంగంలో తణుకుకు ఒక సుస్థిర స్థానాన్ని అందించడంలో ముఖ్యభూమిక వహించిన ఎస్‌కెఎస్‌డి కళాశాల వ్యవస్థాపకులను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ కళాశాల ప్రాంగణం దేవాలయం వంటిదని, విద్యార్థినులు మంచి ప్రవర్తనతో, నిజాయితీగా ఉండి విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు కెవి.సుబ్బారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్, డిగ్రీ, పిజీ కళాశాల ప్రిన్సిపల్ కె.రామకృష్ణ, వివేకానంద గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్.రవీంద్ర పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు, కాళ్ల గ్రామాల్లో పేద కుటుంబాలకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. కాళ్లకూరులో ఇటీవల మానూరి నాగలక్ష్మి కుమారుడు సైకిల్ తొక్కుతూ ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో కాలు ఫ్రాక్చర్ కావటంతో ఆపరేషన్ నిర్వహించారు. ఆ కుటుంబాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు శుక్రవారం పరామర్శించారు. వైద్యం కోసం కాళ్లకూరు జనసైనికులు విరాళంగా కొంత సొమ్ము సేకరించారు. ఆ సొమ్ముతో పాటు నాగరాజు తన వంతు సాయం అందించారు. మొత్తం రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. కాళ్ల గ్రామంలో ఇటీవల కేన్సర్‌తో బాధపడుతూ మరణించిన చోడవరపు అక్కయ్య కుటుంబాన్ని నాగరాజు పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. జనసేన కాళ్ల తరపున బియ్యం కట్ట, నిత్యావసర సరుకులు అందించారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా అదుకుంటామన్నారు. జనసేన పార్టీ పెదఅమిరం గ్రామ అధ్యక్షులు కొండేటి జయ కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నారన్న విషయం తెలుసుకున్న నాగరాజు కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు, పెదమిరం జనసేన నాయకులతో కలిసి జయ ఇంటికి వెళ్లి అర్యోగం గురించి తెలుసుకున్నారు. కాళ్లకూరులో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు గడి రాము, ప్రధాన కార్యదర్శి దిలీప్, కార్యదర్శులు తోటనాని, కొప్పర్తి ఆదిత్య, కాళ్ల గ్రామ యూత్ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు నిమ్మల నాగు, చెన్నూరి భారత్, జనసేన నాయకులు గనిశెట్టి సురేష్, గనిశెట్టి ప్రసాద్, పొట్టిపోతుల సాయి, ఆరేటి సుబ్బారావు, పొట్టిపోతుల జగదీష్, అంబళ్ల వెంకటరమణ, కట్టా సతీష్, బొర్రా శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

భీమవరం : భీమవరంలోని అన్ని కోర్టులలో ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి తెలిపారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, ELURU
E.A.No. 1/2023
in
E.P.No. 90/2022
in
O.S.No. 90/2022
Between :
Sri. Govindu Nagaraju -Petitioner / D.Hr.
and
Sri. padala Satyam - Respondent / J.Dr.
Respondent / J.Dr.
Padala Satyam, S/o.Sanyasi (Late) Hindu, Age 61 years, Dr.No. 20E-13-22, Pappala vari street, Kothapeta, Eluru, Eluru District
పై E.P. వారెంటు గ్రంధములో J.Dr. కు నోటీసు నిమిత్తం పై పిటిషన్‌ను ది.21-9-2023 నకు వాయిదా వేసినారు. సదరు పిటిషన్ విషయముపై J.Dr. కు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా రోజు ఉదయం గం.10-30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తెలుపుగొనవలెను. లేని యెడల పరోక్షముగా విచారించి తీర్మానించెదరని, ఇందు మూలముగా తెలియజేయడమైనది.
శ్రీ కోర్టు వారి అనుమతితో ---
ఇట్లు : సిహెచ్.వెంకట రమణారావు, వి.వి.సాయి రామారావు, అడ్వకేట్స్, ఏలూరు, సెల్ : 8247742566, ఏలూరు, తేది : 1-9-2023

వేలం ప్రకటన
మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు
ఇ.పి.నెం. 216/2010
ఓ.ఎస్.నెం. 56/2005
శ్రీమతి బొప్పన వాణి.... డి.హెచ్.ఆర్.
మరియు
శ్రీమతి కాకరాల రంగనాయకమ్మ వగైరా.. జె.డి.ఆర్స్
పై నెంబరు ఇ.పి. గ్రంధములో డిక్రీ ప్రకారం డి.హెచ్.ఆర్.కు రావలసిన బాకీ రాబట్టుటకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిలోని జె.డి.ఆర్స్. తాలూకు 3/4వ వంతు వాటాను ది.21-9-2023వ తేదీన పైకోర్టులో వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొన దలచిన వారు పై కోర్టు వారి ఎదుట ది.21-9-2023వ తేదీన ఉదయం గం.10-30 ని॥లకు హాజరై వేలంలో పాల్గొనవచ్చును. వేలం వేయబడు ఆస్థి వివరం:
ఏలూరు జిల్లా, ఏలూరు మండలం, వెంకటాపురం పంచాయితీ, శివనగర్, కొత్తూరు రోడ్డులోని 550 చ.గ.లు అందులోని డోరు నెం. 13/36రు గల యిల్లు మరియు కరెంటు కనెక్షన్‌తో సహ ఆస్తికి హద్దులు: తూర్పు - సంపంగి బుజ్జయ్య గారి ఇల్లు, దక్షిణం - రోడ్డు, పడమర - రోడ్డు, ఉత్తరం - ఆర్నేపల్లి రంగారావు గారి యిల్లు పైహద్దుల మధ్య గల 550 చ.గ.లు స్థలం అందులోని యిల్లులో జె.డి.ఆర్స్ తాలూకు 3/4 వంతు వాటా ఆస్థి
డి.హెచ్.ఆర్. విలువ: రూ.2,50,000/-లు
అమీనా విలువ: రూ. 10,25,000/-లు
ఎస్.వి.ఆర్. గాంధీ, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
ఏలూరు, తేది: 05-09-2023

ప్రకటన
మహారాజశ్రీ భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 154/2018 in O.S. 221/2014
Between:
గుంటా బాటమ్మ అనే గంగమ్మ -పిటీషనరు/వాది
మరియు
గులిమే నాగమ్మ (died) మరికొందలు -రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావా గ్రంథములోని వాది అయిన శ్రీమతి గుంటా బాటమ్మ అనే గంగమ్మ, W/o. నక్షత్రం, హిందూ, స్త్రీ, వయస్సు 55 సం॥లు, నారాయణపురం, ఉంగుటూరు (మం), ప్రస్తుతం ఏలూరు జిల్లా అను వారు శ్రీమతి గులిమే నాగమ్మ (died) మరికొందరిపై పార్టీషను దావా దాఖలు చేయగా, అందులో 16వ రెస్పాండెంటు/ ప్రతివాది గులిమే పోతురాజు, S/o. లేటు గంగయ్య, రామశింగవరం (V), ద్వారకాతిరుమల (మం) అనువారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుటకు ప్రయత్నించుచున్నందున వారికి పేరు పబ్లికేషను ద్వారా సమన్లు అమలు జరిపించుటకు శ్రీ కోర్టు వారు అనుమతి ఇచ్చినందున సదరు దావా గ్రంథము ది. 18-09-2023 సం॥ తేదీన వాయిదా ఉన్నందున వారు (మీరు) పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని తెలియచేయడమైనది.
(పై కోర్టు వారి ఉత్తర్వులతో)
కొండేపాటి వెంకటేశ్వరరావు
ఎస్.గోపాలకృష్ణ
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం
సెల్: 9848355344

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P. 25/2022
బిట్వీన్:
కొవ్వూరి నాగేంద్రరెడ్డి -పిటీషనరు/ పిటీషనరు
Vs
కొండేటి సత్యవతి & 7 Others -రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు
ప్రకటన
పై నెంబరు గ్రంథములో 5వ రెస్పాండెంటు అయిన ఏముల వేణుగోపాల్, S/o. late వెంకటరమణ, వ్యాపారం, 37 సం॥లు, డో.నెం. 3-51, సిపాయిపేట, తాడేపల్లిగూడెం-1 వాస్తవ్యులు మరియూ 6వ రెస్పాండెంటు అయిన ఏముల దేవి కిరణ్, S/o. late వెంకటరమణ, 32 సం॥లు, వ్యాపారం, డో.నెం. 3-51, సిపాయిపేట, తాడేపల్లిగూడెం-1 వాస్తవ్యులు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన ఈ పత్రికా ప్రకటన ద్వారా 5వ రెస్పాండెంటుకు, 6వ రెస్పాండెంటుకు వారి ఆఖరు చిరునామాకు నోటీసులు జారీ చేయగలందులకు శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసినందున 5 మరియు 6 రెస్పాండెంట్లుకు ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు కోర్టు వారి ఉత్తర్వులు మేరకు జారీ చేయడమైనది. సదరు 5వ రెస్పాండెంటు మరియు 6వ రెస్పాండెంటు ఇరువురూ ది. 27-9-2023వ తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టుకు హాజరై మీ ఇరువురికి గల ఆక్షేపణలు శ్రీ కోర్టు వారికి తెలియపర్చగలరు. అట్లు కాని ఎడల మీరు ఇరువురూ శ్రీ కోర్టు వారిచే పరోక్షంగా తీర్మానింపబడుదురని యిందుమూలముగా ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
ఎస్.ఎన్.తాజుద్దీన్ బాబా
పిటిషనరు/ పిటీషనరు తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది. 04-9-2023 సెల్: 9949014216

నోటీసు
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 306/2019
బిట్వీన్:
అబ్బిన శ్రీనివాస్ -వాది
మరియు
కొఠారు దేవి ప్రసన్న -ప్రతివాది
పై నెంబరు గ్రంథంలో ప్రతివాది అయిన శ్రీమతి కొఠారు దేవి ప్రసన్న, భర్త: వెంకట రమేష్, సావిత్రి నగర్, హుకుంపేట, రాజమండ్రి అను వారు కోర్టు వారి నోటీసులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున ది. 21-9-2023వ తేదీ పగలు 10.30 ని॥లకు మీరు ప్లీడరు గారి ద్వారా గాని, స్వయంగా గాని హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
కాజ నాగేశ్వరరావు, అడ్వకేట్
తాడేపల్లిగూడెం, సెల్: 9989538628

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, భీమడోలు
ఒ.ఎస్. నెం. 29/2019
కెనరా బ్యాంక్ (పూర్వపు సిండికేట్ బ్యాంక్) ఎస్‌జివి బ్రాంచ్, ఏలూరు -వాది
మరియు
1. బండి హనుమంతరావు
2. కుంకుళ్ళ వరలక్ష్మి -ప్రతివాదులు
టు:
కుంకుళ్ళ వరలక్ష్మి, భర్త: లేటు పద్మారావు, డోరు నెం. 6ఎ-7-9, దక్షిణపు వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.
పత్రికా ప్రకటన
పై నెంబరు దావా గ్రంధములో 2వ ప్రతివాది మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము మీకు కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించిననూ అవి ప్రతివాది తీసుకొనక త్రిప్పి పంపుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ప్రతివాదికి దావా సమన్లు పత్రికా ప్రకటన మూలంగా తెలియచేయుటకు ఆర్డరు చేసియున్నారు. పై దావా గ్రంధము ది. 27-09-2023వ తేదీకి వాయిదా అయి వున్నది. కావున ఆరోజున మీరు స్వయముగా గాని, లేదా మీ తరపున న్యాయవాది ద్వారా గాని ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.
వాయిదా తేది: 27-09-2023
టి.వి.విశ్వనాథం, అడ్వకేట్
అగ్రహారం, ఏలూరు, సెల్: 9441040029